# తనదాకా వస్తే...
## ఆదోని లలిత




శ్రీకాంత్, శశి 'ప్యార్' మూవీ చూసి ఇంటి కొచ్చారు. శ్రీకాంత్ చాలా ఉత్సాహంగా వున్నాడు. కొంతసేపు రెస్టు తీసుకుందామని మంచం మీద పడుకున్నాడు. "ప్యార్"లో చూసిన కొత్త హీరోయిన్ రూపమే మనస్సులో మెదలింది. అంతలో శశి వచ్చి మెల్లగా శ్రీకాంత్ ప్రక్కన పడుకుని అతని వైపు చూసింది. తను వచ్చిన విషయం కూడా గమనించనట్టు కనులు మూసుకుని ఏదో ఆలోచిస్తున్నాడు. పెదవులపైన చిరునవ్వు. ఇక ప్రయోజనం లేదనుకుని మూసుకున్న శ్రీకాంత్ కనురెప్పపై సుతారంగా ముద్దు పెట్టి "ఏంటట అంత ఆలోచన?" అంది.

"ఆ! ఏం లేదు. మనం చూసిన పిక్చర్ గురించే ఆలోచిస్తున్నాను. శశీ! ఆ న్యూ హీరోయిన్, ప్రియ సుపర్బ్ కదూ! అంత అందమైన పెద్ద కళ్ళు మరే హీరోయిన్‌కూ లేవనుకుంటాను. ఆ పెదవులు, ఆ నవ్వు, ఓహ్! మంచి హైట్, హైటుకు తగ్గ బాడీ. ఎస్పెషల్లీ ఆ స్విమ్మింగ్ సూట్‌లో....." అంటూ మరలా తన్మయంగా కళ్ళు మూసుకున్నాడు. అతని ధోరణికి శశికి చాలా అసహనంగా అనిపించినా నిగ్రహించుకుంది. కొన్ని క్షణాల తరువాత మరలా శ్రీకాంతే,

"శశీ! నీకెలా అనిపించింది ప్రియ" అన్నాడు. దానికి శశి "ప్రియ బాగుంది కానీ, నా కాన్సెన్‌ట్రేషన్ అంతా కొత్త హీరో ప్రియతమ్ మీదే వుంది. ఆ ఫేస్, ఎస్పెషల్లీ ఆ బాడీ బిల్డ్ సుబర్బ్ అండీ. అతనికున్న అంత చక్కటి బాడీ బిల్డ్ ఇప్పుడున్న హీరోలకెవ్వరికీ లేదనుకుంటాను. అతని బాడీ బిల్డ్ ముందు ప్రియ పర్సనాలిటీ ఏమాత్రం?" అంది. అంతే శ్రీకాంత్ నోరు మూత బడింది. భర్త మరో స్త్రీని వర్ణిస్తే భార్య సహించాలి. అదే భార్య మరొక పురుషుని వర్ణిస్తే భర్త సహించలేడా? తనలోతను నవ్వుకుంది శశి.

మరుసటి రోజు ఆఫీసులో ఇంటర్వ్యూలు వున్నాయని శ్రీకాంత్ హడావుడిగా ఆఫీసుకు బయలుదేరాడు. ఇంటర్వ్యూకు పదిమంది వచ్చారు. ఇంటర్వ్యూ అయిన వెంటనే ఫోను రింగ్ అయింది. అది రమేష్ కాల్. రమేష్ తను బాల్య స్నేహితులు.

"హాయ్‌రా! ఎలా వున్నారు బటర్ ఫ్లయిస్? ఎవరిని సెలెక్ట్ చేశావు? ఎలా ఉంది? ఓ.కే. టైపేనా? లేకుంటే నీవు సెలెక్టు చేస్తావా?" ప్రశ్నల పరంపర ఫోనులో.

"యిడియట్! అన్ని ప్రశ్నలు ఫోనులోనేనా? అన్నిటికి బదులివ్వటానికి టయిమ్ లేదు. ఈవినింగ్ క్లబ్‌లో మీట్ అయినపుడు అన్నీ చెబుతాను. ఓ.కె. సీ.యూ" అని పెట్టేశాడు శ్రీకాంత్.

రాత్రి క్లబ్ నుండి వచ్చిన తరువాత తనూ, శశి భోం చేస్తున్నపుడు శశి, 'శ్రీకాంత్ మీ చెల్లి దీపకు, మహేష్ ఇంజనీరింగు కంపెనీ నుండి అపాయింట్‌మెంటు ఆర్డరు వచ్చింది" అంది. ఆ మాటకు శ్రీకాంత్ ఆశ్చర్యంతో.

"అపాయింట్‌మెంటు ఆర్డరు రావటమేంటి? ఇంటర్వ్యూకెప్పుడు వెళ్ళింది?"

"లాస్ట్ వీక్ వెళ్ళిందండి" శశి.

"నాతో చెప్పలేదేంటి? నాకు తెలిస్తే అలాంటి చోటికి ఇంటర్వ్యూకు వెళ్ళొద్దని చెప్పేవాణ్ణి. ఆ మహేష్ నాకు బాగా తెలుసు. వాడి కేరక్టర్ అంత మంచిది కాదు. ముందు అపాయింట్‌మెంటు ఆర్డరును రిజెక్టు చేయమను. లేకుంటే, నేను దీపతో రేపు మాట్లాడుతాను" అని చెప్పి భోజనం ముగించి తన గదికెళ్ళిపోయాడు శ్రీకాంత్.


తన పనులు ముగించుకుని బెడ్ రూముకెళ్ళేప్పటికి శ్రీకాంత్ నిద్ర పోతున్నాడు. తను శ్రీకాంత్‌కు నిద్రా భంగం కాకుండా వెళ్ళి పడుకుంది. నిద్ర పట్టని కనులు మనస్సు పుటలను తెరిచాయి.

మూడు సంవత్సరాల క్రితం తను శ్రీకాంత్ ఆఫీసులో శ్రీకాంత్‌కు పి.ఎ.గా చేరింది. తన పొందు కోసం శ్రీకాంత్ ఎన్నో విధాలుగా ప్రయత్నించాడు. తను లొంగనందుకు, ఎలాగయినా తనను పొందాలన్న పట్టుదలతో చివరికి తనను పెళ్ళాడుతానన్నాడు. శ్రీకాంత్ బలహీనతలు కొన్ని తనకు తెలిసినప్పటికి తను పెళ్ళికి సమ్మతించింది. దానికి కారణం తమ కుటుంబ పరిస్థితులు.

## సిగ్గు చేటు!

**వా**ర్తల్లో వ్యక్తిగా ఎప్పుడూ దాసరి ముందుంటాడు. తాజాగా 'చిన్నా' చిత్రం రిలీజైంది. సినిమా బావుందన్న టాక్ వచ్చింది. అయితే కొంతమంది ప్రబుద్ధులు పనిగట్టుకొని ఆ సినిమా మీద దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది అమానుషం!

ఎందరో నటీనటులకి 'లైఫ్' ఇచ్చిన నేను నా బిడ్డకి నటుడుగా 'లైఫ్' ఇవ్వలేని దుస్థితిలో ఉండటం నిజంగా ఇండస్ట్రీకే సిగ్గుచేటు! దీన్ని నేను ఖండిస్తున్నాను అంటూ తెగేసి చెప్తున్నాడు దాసరి!



అలాంటి శ్రీకాంత్ ఇప్పుడు మహేష్ కేరక్టరు గురించి, అతని బలహీనతలను గురించి మాట్లాడుతున్నాడు తన చెల్లి విషయం గనుక. తనలో తను నవ్వుకుని రాని నిద్రకుపక్రమించింది శశి.

మరుసటి రోజు ఉదయం ఆఫీసు కెడుతూ శ్రీకాంత్ సాయంకాలం, ఫ్రెండ్సును 'టీ'కి పిలిచానని ఎవ్వరెవ్వరు వస్తున్నారో చెప్పి తను చేయవలసిన ఏర్పాట్లను గురించి కూడా చెప్పి వెళ్ళాడు.

సాయంకాలం తను హాలులో అన్ని ఏర్పాట్లు చేసింది. దీప కూడా కొంత సహాయం చేసింది. అనుకున్న టయింకు అందరూ వచ్చారు శ్రీధర్, శ్రీప్రియ తప్ప. వచ్చిన వాళ్ళందరితోనూ తనకు పరిచయముంది. శ్రీకాంత్ తనను అప్పుడప్పుడు వాళ్ళిళ్ళకు తీసికెళ్ళుతుంటాడు. వాళ్ళూ వస్తుంటారు. కానీ అందరూ ఒక్కసారిగా కలవటం ఆ రోజు విశేషం. అభిలాష్, అఖిల ఇద్దరూ జాబ్ చేస్తున్నారు. అఖిల చాలా మోడరన్‌గా వుంటుంది. సుమన్, శ్రుతి మరో జంట. శ్రీకి తనలాగా ఇంటి పట్టున వుంటుంది. జాబ్ చేయటం లేదు. పద్మజ వంటరిగా వచ్చింది. ఎందుకంటే జీవితం ఆమెకు వంటరి తనాన్నే మిగిల్చింది. ఆమె భర్తతో కలిసి లేదు. వారు విడిపోవటానికి అసలయిన కారణం తనకు తెలియదు. పద్మజ ఎప్పుడూ చాలా గంభీరంగా, నిండుగా పారుతున్న ఏరులా వుంటుంది. ఆమె ముఖం ఎప్పుడూ ప్రశాంతంగా వుంటుంది. కళ్ళు మాత్రం ఎప్పుడూ దేన్నో నిరీక్షిస్తున్నట్టుగా వుంటాయి.

అందరూ చాలా సంతోషంగా వున్నారు. అందరి ముఖాలలోనూ నవ్వుల పువ్వులు విరిశాయి. ఒక ప్రక్కన టీ.వి. ఆన్‌లో వుంది తక్కువ వాల్యూంతో చాలాసేపు మాటల సందడితో, సంతోషంగా గడిచిపోయింది. తరువాత శశి, తాను ప్రత్యేకంగా చేసిన స్వీటూ, హాటూ సర్వ్ చేసింది అందరికీ దీప సహాయంతో. అప్పుడే చాలా ఆలస్యంగా శ్రీధర్, శ్రీప్రియ వచ్చారు.

"ఏంటి ఇంత లేట్?" అంటూ శ్రీకాంత్ వారిని రిసీవ్ చేసుకున్నాడు. వారికి కూడా ప్లేట్లు అందజేసింది శశి. శ్రీప్రియ చాలా అందంగా వుంటుంది. శ్రీధర్ బాగా నలుపు. నలుపే గాక అన్ని విధాలుగా బాగుండడు. వారిది మంచి సంపన్న కుటుంబం. శ్రీప్రియకు ఆడంబరాల మీద మక్కువ. అందుకే మధ్య తరగతి కుటుంబం నుండొచ్చిన తను పెళ్ళికి సమ్మతించింది. శ్రీధర్ అన్ని ఖర్చులు తనే పెట్టుకుని పెళ్ళి చేసుకున్నాడు. కొంతసేపటి తరువాత శ్రీధర్ ప్లేటు పుచ్చుకుని పద్మజ దగ్గరికెళ్ళాడు. వారిద్దరూ క్లాస్ మెట్స్. శ్రీధర్ ఏదో మాట్లాడుతున్నాడు. పద్మజ ముక్తసరిగా బదులిస్తున్నట్టనిపించింది. అంతలో శ్రీప్రియ తన దగ్గరికొచ్చింది, ప్లేటులోని పదార్థాలను తింటూ. తన ప్రక్కన కూర్చుని శ్రీధర్, పద్మజల వైపు చాలా సీరియస్‌గా చూస్తూ, తనలో తనకు మాత్రమే వినిపించేట్టు మెల్లగా.

"శశిగారూ! ఇలాంటి ఆడవాళ్ళతో జాగ్రత్తగా ఉండాలండీ! భర్తతో లేదు కదూ! అయినా మా వారికేంటి ఆవిడతో పని ఎంతటి క్లాస్ మెట్ అయినా అని గుసగుసగా చెప్పింది. శశికి తను ఏం చెప్పాలో తోచక మౌనంగా ఉండిపోయింది తల దించి, ఒకసారి తనూ, శ్రీకాంత్ బీచి కెళ్ళినపుడు శ్రీప్రియను బీచిలో ఎవరో అందమయిన యువకునితో చూశారు. శ్రీప్రియ తమను గమనించలేదు. చాలా సన్నిహితంగా, పరిసరాలను మరచిన వారి ప్రవర్తనను చూసి తను ఆశ్చర్యపోతూ,

"ఇదేంటండీ!" అంది శ్రీకాంత్‌తో.

"అంతే శశీ! నేనూ వారిద్దరిని చాలాసార్లు చూశాను. ఇలాంటి వాటిని చూసీ చూడనట్టుండాలి. ఇవన్నీ ఘరానా దొంగతనాలు" అన్నాడు శ్రీకాంత్.

అలాంటి శ్రీప్రియ, తన కళ్ళకు బాగాలేని భర్త మరో స్త్రీతో చనువుగా మాట్లాడినపుడు, అతడేమో మన్మధుడయినట్టు, అవతలి స్త్రీ అతన్నే ఆకర్షిస్తుందేమోనని అనుమానపడటం.... తనలో తనే నవ్వుకుంది శశి. అందరూ తినటం పూర్తి చేసినట్టనిపించి "అందరికి 'టీ' తెద్దామని లోపలికెళ్ళబోతూ, భర్త బిగ్గరగా నవ్వటం వినిపించి అటు తిరిగి చూసింది. శ్రీకాంత్ అభిలాష్‌తో ఏదో చెప్పి బిగ్గరగా నవ్వుతున్నాడు. అంతలో అఖిల అతను చెప్పినదానికి మెచ్చుకోలుగా క్లాప్స్ కొట్టి నవ్వుతోంది. అలా నవ్వుతున్నపుడు ఆమె పవిట జారింది. అది ఆమె పట్టించుకోకుండా అలానే నవ్వుతోంది. శ్రీకాంత్ నవ్వటం ఆపి, పలుచటి వైట్ స్లీవ్ లెస్ బ్లవుస్‌లోని బ్లాక్ బ్రాలో కనిపిస్తున్న అందాలను చూస్తుండిపోయాడు, ఒక క్షణం విచక్షణ మరచి. తను లోపలికెళ్ళి 'టీ'లు తెచ్చింది. అందరికి 'టీ' ఇస్తూ సుమన్‌కు వంగి టీ అందిస్తున్నపుడు అనుకోకుండా తను పవిటను క్లిప్ చేసినప్పటికి ముందుకు జారింది. ఒక చేతిలో 'టీ' కప్పు, మరో చేతిలో ట్రే, తను వెంటనే పవిటను సర్దుకోలేకపోయింది. సుమన్ సంస్కార మున్న మనిషి 'టీ' కప్పు అందుకుని వెంటనే తల వంచుకుని కూర్చున్నాడు. అదే సమయంలో సుమన్ దగ్గరికొచ్చిన శ్రీకాంత్ ఆదృశ్యాన్ని చూసి, శశి పాదాన్ని తన పాదంతో నొక్కాడు, సర్దుకోమని హెచ్చరిస్తున్నట్టుగా. తను సర్దుకుని, శ్రీకాంత్ ముఖంలోకి చూసి ముందుకు సాగింది మిగతా 'టీ' కప్పులతో. శ్రీకాంత్ ముఖం అదోలా పెట్టుకున్నాడు. మరి కొంతసేపటికి పార్టీ ముగిసింది. అందరు వెళ్ళిన తరువాత దీప హాలు సర్దటంలో వదినకు సహాయం చేసి తన గదికెళ్ళిపోయింది.

శ్రీకాంత్, శశి కొంచెం రిలాక్స్ అయి కూర్చున్నారు. శశి మెల్లగా శ్రీకాంత్ వైపు చూసింది. శ్రీకాంత్ ముఖం ఇంకా ప్రసన్నంగా లేదు శశి తనను చూసి వెంటనే.

"ఏంటి శశీ! పవిట చక్కగా క్లిప్ చేసుకో లేవూ? ఒకరి ఎదురుగుండా అలా...." అన్నాడు. శశి బదులు చెప్పకుండా శ్రీకాంత్‌ను నిశితంగా చూస్తుండిపోయింది. ఒకరి భార్య పవిట జారితే సంస్కారహితంగా సంతోషం పొందే మగవాడు, తన భార్య, పవిట మరొకరి సమక్షంలో జారితే సహించలేడా?.... అనుకుని శశి తనలో తను నవ్వుకుంది.

ఆమె మనస్సులో తమ నలుపును తాము ఎరుగని గురువింద గింజలు మెదిలాయి.

❋